క్లుప్తంగా

కేతిరెడ్డికి సన్మానం



కేతిరెడ్డిని సత్కరిస్తున్న గంగాధర్ నాయుడు

ధర్మవరం రూరల్: వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షునిగా ఓబుళనాయనపల్లికి చెందిన జి.గంగాధర్‌నాయుడును నియమించిన నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిని మంగళవారం ఆయన నివాసంలోనే ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలతో కలిసి స్వీట్లు పంచుకొని సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదినారాయణ, రామ్మోహన్‌నాయుడు, పుల్లప్ప, బాబ్‌జాన్, క్రిష్ణానాయక్, మండల రామ్మోహన్, హరి, మురళీ మోహన్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, రామ్మోహన్‌రెడ్డి, హనుమంతరెడ్డి, క్రిష్ణారెడ్డి, చెన్నారెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ప్రశాంతంగా జీవించండి

తాడిమర్రి: గ్రామాల్లో గొడవలు, ఘర్షణలు వీడి ప్రశాంతంగా జీవించాలని ముదిగుబ్బ రూరల్ సీఐ శ్యామరావు సూచించారు. దాడితోట గ్రామంలో మంగళవారం ఆయన ఎస్‌ఐ కృష్ణవేణి, సిబ్బందితో కలసి సోదాలు చేశారు. అనంతరం గ్రామస్తులో సమావేశం నిర్వహించారు. కక్షలు, కార్పణ్యాలకు పోకుండా అన్నదమ్ముల వలె ప్రేమాభిమాలు కలిగి ప్రశాంతంగా జీవనం సాగించాలన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

పుట్టపర్తి టౌన్: ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో పూర్తిగా సహాయ సహకారాలు అందిస్తామని డీపీటీఓ మధుసూదన్ పేర్కొన్నారు. ఏపీ పీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ నేతలు మంగళవారం పుట్టపర్తిలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా నూతన రీజనల్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. జిల్లా అధ్యక్షుడిగా జి.వై.పి.రావ్, వర్కింగ్ ప్రసిడెంట్ ఆర్ఎస్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా నరసింహులు, బాబయ్య, శోభారాణి, సెద్దగంగప్ప, కార్యదర్శిగా శ్రీనివాసులు, ట్రెజరర్ రమణప్ప, ప్రధానకార్యదర్శి ఆదినారాయణ, జాయింట్ సెక్రటరీలుగా ఖలీల్‌బాషా, పెద్దన్న, ఆర్.వి.లక్ష్మి, అసిస్టెంట్ సెక్రటరీలుగా నరసింహులు, ఎ.ఎ.నాయక్, జి.విజయలక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. అనంతరం ఏపీ పీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి నాగార్జునరెడ్డి, నూతన కమిటీ రాష్ట్ర కార్యదర్శి నబీరసూల్ డీపీటీఓ కార్యాలయంలో డీపీటీఓను మర్యాద పూర్వకంగా కలిశారు.

ప్రారంభోత్సవానికి విచ్చేయండి



మాజీ ఎమ్మెల్యేని ఆహ్వానిస్తున్న గురుస్వామి

ధర్మవరం: పట్టణంలోని కేశవనగర్‌లో నూతనంగా నిర్మించిన అయ్యప్పస్వామి దేవాలయ ప్రారంభోత్సవానికి హాజరు కావాలని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిని గురుస్వామి పి.జె.విజయ్‌కుమార్ ఆహ్వానించారు. మంగళవారం మాజీ ఎమ్మెల్యేను ఆయన నివాసంలో గురుస్వామి కలిసి శాలువాతో సత్కరించి, ఆలయ ప్రారంభోత్సవ ఆహ్వాన పత్రికను అందించారు. ఈ నెల 11 నుంచి 14 వరకు జరిగే విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవానికి రావాలని ఆహ్వానించారు.

విగ్రహ ఏర్పాటుకు విరాళం

తనకల్లు: కొక్కంటిక్రాస్‌లో ఏర్పాటు చేయనున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి రియల్టర్ పాలెం సుధాకర్ మంగళవారం రూ.లక్ష విరాళం అందజేశారు. విగ్రహ కమిటీ సభ్యులు మట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహానికి రూ. లక్ష ఖర్చు అవుతుందన్నారు. విషయాన్ని పాలెం సుధాకర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన ఖర్చు మొత్తం తానే భరిస్తానని ముందుకు వచ్చినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఆదినారాయణ, దళిత సంఘం నాయకులు శంకర, బావన్న, కుళ్లాయప్ప, రామచంద్ర పాల్గొన్నారు.

భూసార పరీక్ష.. నేలకు రక్ష

- పంట నేల స్వభావంపై కచ్చితమైన అంచనా
- ఫలితాలను బట్టి ఎరువుల వినియోగం
- భారీగా తగ్గనున్న పెట్టుబడి వ్యయం
- అధిక దిగుబడులకూ అవకాశం



పొలంలో మట్టి నమూనాలను సేకరిస్తున్న వ్యవసాయాధికారి ముస్తఫా

ధర్మవరం రూరల్: భూసార పరీక్షలు చేయించడం వల్ల అందులో ఉన్న పోషకాలు, పోషకాల లోపం, ఆమ్ల, క్షార, స్థితి, చౌడు ఇతర సమస్యలు తెలుస్తాయి. వ్యవసాయాధికారులు సిఫారసు మేరకు సిబ్బంది ఎప్పటి కప్పుడు రైతులకు సాగు భూమిలో ఏ ఎరువులు ఎంత మోతాదులో వాడవచ్చో తెలియజేయడం వల్ల అనవసర వ్యయం గణనీయంగా తగ్గుతుంది. వ్యవసాయం లాభసాటిగా ఉండాలంటే తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు పొందే మార్గాలు అనుసరించాలి. భూమిలో ఉన్న పోషకాలు, లోపాలు తెలుసుకొని వాటికి అనుగుణంగా పంటల సాగు, ఎరువుల వినియోగానికి భూసార పరీక్షలు ఎంతగానో దోహదపడతాయి.

నమూనాల సేకరణలో జాగ్రత్తలు

కోతలు పూర్తయిన తరువాత వేసవిలో పంటలు లేని సమయాల్లో మట్టి నమూనాలను సేకరించాలి. పొలాలకు సాగు నీరు పెట్టినప్పుడు, ఎరువులు వేసిన తరువాత మట్టి నమూనాలను సేకరించకూడదు. పొలాల్లో నీడ పడే ప్రదేశాలు గట్లు, చెట్లు ఉన్న ప్రాంతంలో మట్టి నమూనాలను తీయకూడదు. ముందుగా నేలపై ఉన్న గడ్డి, చెత్త, కలుపు మొక్కలు తీసివేయాలి. వరి పొలంలో 'వి' ఆకారంలో 15–20 సెంటీమీటర్ల లోతున పారతో గుంత తీసి పై పార నుంచి కింది వరకూ ఒక పక్కగా మట్టిని సేకరించాలి. వ్యవసాయ క్షేత్రంలో 'జెడ్' ఆకారంలో సుమారు ఎనిమిది ప్రదేశాల్లో సేకరించిన మట్టిని బాగా కలిపి అర కేజీ బరువు వచ్చేలా తీసుకొని నీడలో ఆరబెట్టాలి. మట్టి బాగా ఆరిన తరువాత పాలిథిన్ కవర్‌లో నింపి రైతు వివరాలు, సర్వే నంబర్, విస్తీర్ణం, గతంలో సాగు చేసిన పంట తదితర వివరాలను నమోదు చేసి పరీక్షా కేంద్రాలకు తరలించాలి. వ్యవసాయ పంటలు పండించే భూముల్లో ఆరు అంగుళాల లోతు నుంచి నమూనాలను సేకరించాలి. పండ్ల తోటలకు అడుగు లోతుతో ప్రతి అడుగుకు ఒక నమూనా, అలాగే చౌడు, ఆమ్ల నేలల్లో అడుగు లోతుతో ప్రతి 8 అంగుళాలకు ఒక నమూనా తీయాలి.

పోషకాల స్థాయిపై పక్కా లెక్క

వ్యవసాయ క్షేత్రంలో సేకరించిన మట్టిని ప్రయోగశాలలకు తరలించి వివిధ భౌతిక, రసాయనిక పద్ధతుల ద్వారా విశ్లేషించి నేల స్వభావాన్ని, లక్షణాలను తెలియజేస్తారు. ఆయా భూముల్లో లవణాల సాంద్రత, నేల, ఆమ్ల, క్షార గుణాలు ఆ నేలలో ఉన్న పోషకాలు స్థాయిని విశ్లేషించి వాటి ఫలితాల ఆధారంగా చేయాల్సిన పంట, వినియోగించే ఎరువుల మోతాదు సూచిస్తారు.

డివిజన్‌లో నమూనాల సేకరణ ఇలా..

ధర్మవరం వ్యవసాయ డివిజన్‌లో ధర్మవరం, బత్తలపల్లి, తాడిమర్రి, కనగానపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాలు ఉన్నాయి. తాడిమర్రి, కనగానపల్లి మండలాల్లో ఎక్కువగా పండ్లతోటలు సాగు చేస్తుండగా.. మిగిలిన మండలాల్లో వేరుశనగ, వరి, మొక్కజొన్న, కంది, అలసంద, కూరగాయల పంటలు సాగు చేస్తున్నారు. డివిజన్ పరిధిలో 2025–26 సంవత్సరానికి గాను భూసార పరీక్షల కోసం 7,357 మట్టి నమూనాలను సేకరించాలని అధికారులు లక్ష్యం పెట్టుకున్నారు. ఇందులో ఈ ఏడాదికి అంటే 2025 సంవత్సరానికి గాను 2,936 నమూనాలను సేకరించనున్నట్లు వ్యవసాయాధికారులు చెపుతున్నారు. మిగిలినవి వచ్చే ఏడాదికి పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు.

భూసార పరీక్షలతో ప్రయోజనం



భూ సార పరీక్షల ఆధారంగా ఏ పంటకు ఎంత మోతాదులో పోషకాలు అవసరమో తెలుస్తుంది. దీంతో భూమిలో లోపించిన పోషకాలను గుర్తించి దానికి అనుగుణంగా ఎరువులను వినియోగించడంతో పెట్టుబడి ఖర్చు తగ్గించుకునే వీలు కలుగుతుంది. పంటలకు అవసరమైన పోషకాలను రసాయన రూపంలో కంటే సేంద్రియ జీవన ఎరువుల రూపంలో అందించడం ద్వారా ఖర్చులు తగ్గించుకుని నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చు

– క్రిష్ణయ్య, ఏడీఏ, ధర్మవరం

బాలికల సంరక్షణే ధ్యేయం

తాడిమర్రి: కిశోరి బాలికల సంరక్షణే ధ్యేయంగా సమ్మర్ క్యాంపు (తరగతులు)లు నిర్వహించాలని చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ మురళీధర్ ఆదేశించారు. తాడిమర్రిలోని 2, 3, 4 అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం జరిగిన కిశోరి బాలికల వికాస్ సమ్మర్ క్యాంపులను ఆయన సూపర్‌వైజర్ లలితమ్మతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11 ఏళ్ల నుంచి 18 ఏళ్ల యుక్త వయసు బాలికలు తరగతులకు హాజరయ్యేలా అవగాహన కల్పించాలన్నారు. బాలికల హక్కులు, చట్టాలు, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, పౌష్టికాహారం తదితర విషయాల గురించి వివరించాలని అంగన్‌వాడీ కార్యకర్తలను ఆదేశించారు. కార్యక్రమంలో భారతి, జయలక్ష్మీ, నాగలక్ష్మీ తదితర అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కిశోర వికాసంపై అవగాహన

చెన్నేకొత్తపల్లి: మేడాపురం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం కిశోర బాలికలకు కిశోర వికాసంపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కిశోర బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యం, పౌష్టికాహారం విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో అంగన్‌వాడీ కార్యకర్త ఈశ్వరమ్మ, సచివాలయం మహిళా పోలీస్ భాగ్యమ్మ వివరించారు.

పోస్టర్ విడుదల

గాండ్లపెంట: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోరి వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ హాజరై కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నల్లచెరువు సీడీపీఓ జయంతి, తహసీల్దార్ బాబూరావు, ఎంపీడీఓ వెంకటరామిరెడ్డి. సూపర్‌వైజర్ పద్మావతి పాల్గొన్నారు.

హామీ ఇచ్చారు.. మరచిపోయారు



ముచ్చురామి వద్ద ఉన్న బ్రిడ్జికి తాత్కాలికంగా మట్టి వేసుకున్న దృశ్యం

గత ఏడాది కురిసిన వర్షాలకు ధర్మవరం మండలం ముచ్చురామి వద్ద ఉన్న బ్రిడ్జి కొట్టుకుపోయింది. పలు గ్రామాల ప్రజలు పట్టణానికి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తాత్కాలికంగా బ్రిడ్జికి అడ్డుగా మట్టిని వేసుకుని రాకపోకలు సాగించారు. ఈ విషయాన్ని గ్రామీణ ప్రజలు కూటమి నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. ఎనిమిది నెలల క్రితం కూటమి నాయకులు బ్రిడ్జిని పరిశీలించారు. బ్రిడ్జిని నిర్మించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. అయితే నేటికీ పట్టించుకోలేదు. వర్షాలు కురిస్తే తాత్కాలికంగా వేసిన మట్టి కొట్టుకుపోతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇచ్చిన హామీ నెరవేర్చక పోవడంతో స్థానికులు మండిపడుతున్నారు.

– ధర్మవరం రూరల్:

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



యూనిఫాం పంపిణీ చేస్తున్న వైద్యాధికారి హరిత

తాడిమర్రి: గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని వైద్యాధికారి హరిత ఆశా కార్యకర్తలకు సూచించారు. తాడిమర్రి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశాలు తమ పరిధిలోని గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం గురించి తగిన సూచనలు, సలహాలు అందిస్తుండాలన్నారు. అనంతరం ఆశా కార్యకర్తలకు యూనిఫాం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ లలిత కుమారి, పీహెచ్ఎస్ లక్ష్మీదేవి, ఏఎస్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్నారుల సంరక్షణపై అవగాహన

చెన్నేకొత్తపల్లి: ఎన్ఎస్‌గేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశావర్కర్లకు చిన్నారుల సంరక్షణపై అవగాహన కల్పించారు. మండల వైద్యాధికారి డాక్టర్ రవినాయక్ వడదెబ్బకు గురైతే ప్రథమ చికిత్స ఎలా చేయాలనే విషయాన్ని ఆశావర్కర్లకు తెలియజేశారు. వేసవిలో ఓఆర్ఎస్‌తో కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ గోవిందమ్మ, పీహెచ్ఎన్ పద్మావతి, హెల్త్ అసిస్టెంట్లు వెంకటేష్, విష్ణువర్ధన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలపై రూ.15వేల కోట్ల భారం

- దోచుకోవడం..దాచుకోవడమే బాబుకు తెలిసిన విద్య
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పూల శ్రీనివాసరెడ్డి



కదిరి: 'యాక్సిస్ ఎనర్జీ వెంచర్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్‌తో చంద్రబాబు సర్కారు యూనిట్ ఏకంగా రూ.4.60 చొప్పున కొనుగోలుకు సిద్ధం కావడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత జగన్ ప్రభుత్వం యూనిట్ కేవలం రూ.2.49 పైసలకే కొనుగోలు చేస్తే విషం కక్కిన కూటమి పెద్దలు ఇప్పుడు అధిక ధరకు చేసుకున్న ఒప్పందంపై ఎల్లో మీడియాతో పాటు కూటమి నేతలు ఏమి సమాధానం చెబుతారు?' అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పూల శ్రీనివాసరెడ్డి నిలదీశారు. మంగళవారం ఆయన తన స్వగృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ విద్యుత్ ఒప్పందంతో రాష్ట్ర ప్రజలపై రూ.15 వేల కోట్ల భారం పడుతుందని, సంపద సృష్టి అంటే ఇదేనా? అని ప్రశ్నించారు. దోచుకోవడం..దాచుకోవడమే చంద్రబాబుకు తెలిసిన విద్య అని అన్నారు. సూపర్ సిక్స్ అంటూ ఎన్నికల సమయంలో ఊదరగొట్టి.. అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క పథకమూ అమలు చేయలేదని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో అవినీతికి తావులేకుండా మద్యం దుకాణాలను ప్రభుత్వమే నడిపితే.. ప్రస్తుత కూటమి సర్కార్ మద్యం దుకాణాలన్నింటినీ పచ్చచొక్కాలకు కట్టబెట్టిందన్నారు. ఈ లిక్కర్ మాఫియాకు చంద్రబాబే బాస్ అని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ ఇటీవల రాప్తాడు నియోజకవర్గంలో పర్యటించినప్పుడు సరైన భద్రత కల్పించకుండా.. దాన్ని కప్పిపుచ్చుకునేందుకు అమాయకులపై కేసులు పెట్టారని దుయ్యబట్టారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి



పోస్టుకార్డుల ఉద్యమం చేపట్టిన వాల్మీకులు

తలుపుల : వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని రాయలసీమ జిల్లాల వాల్మీకి సంఘం అధ్యక్షులు ఎం.నరసింహులు డిమాండ్ చేశారు. ఆ మేరకు మంగళవారం ఆయన ఆధ్వర్యంలో పులిగుండ్లపల్లిలో వాల్మీకులు పోస్టుకార్డుల ఉద్యమం చేపట్టారు. 2019లో ప్రధాని మోదీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరుతూ పోస్టుకార్డుల ఉద్యమం చేపట్టినట్లు నరసింహులుతో పాటు రాష్ట్ర అధికార ప్రతినిధి మేకల శివప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో వాల్మీకులు ఆదినారాయణ, శ్రావణి, శ్రీరాములు, ఆంజినేయులు, శ్రీరాములు, అంజి, భార్గవ పాల్గొన్నారు.

కదిరి టౌన్: వాల్మీకి/ బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని రాష్ట్ర వాల్మీకి సేవా సంఘం అధ్యక్షుడు బంగారు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో పోస్టు కార్డుల ఉద్యమం చేపట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు అంజనాదేవి, రాయలసీమ జిల్లాల కార్యదర్శి ప్రమీల, బీజేపీ నాయకుడు సుదర్శన్, పట్టణ అధ్యక్షురాలు శాంతమ్మ, వాల్మీకి సంఘం నాయకులు సురేష్, పుట్టపర్తి జిల్లా నాయకులు వెంకటేష్, రాము, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా క్రాంతికుమార్

పుట్టపర్తి టౌన్: పుట్టపర్తి మున్సిపల్ కమిషనర్‌గా క్రాంతికుమార్‌ను నియమిస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్ ఉత్వర్వులు జారీ చేశారు. సార్వత్రిక ఎన్నికల అనంతరం కదిరి శానిటేషన్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ప్రహ్లాదను డిప్యూటేషన్‌పై పుట్టపర్తి కమిషనర్‌గా వేశారు. ఆయనను తిరిగి పాత స్థానానికి రప్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గ్రూప్‌లో ఉద్యోగం పొంది అసిస్టెంట్ రిజిస్టర్ కోపరేటివ్ డిపార్టుమెంట్‌లో పనిచేస్తున్న క్రాంతి కుమార్‌ను పుట్టపర్తి మున్సిపల్ కమిషనర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

కార్మికులు చట్టాలు, నియమాలు తెలుసుకోవాలి



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి వెంకటేశ్వర్లు

బత్తలపల్లి: పరిశ్రమలలో పనిచేసే కార్మికులు చట్టాల గురించి, యాజమాన్య నియమ నిబంధనలను తెలుసుకోవాలని ధర్మవరం సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు సూచించారు. మంగళవారం వేల్పుమడుగు బస్ స్టాప్ వద్ద నెలకొల్పిన జేఆర్ సిల్క్ ఫ్యాక్టరీలో హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా జడ్జి ఉత్తర్వుల మేరకు మే డే వారోత్సవాలలో భాగంగా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ చట్టంలో పరిశ్రమ యాజమాన్యం కార్మికులకు కల్పించవలసినటువంటి నియమ నిబంధనల గురించి కార్మికులకు, యాజమాన్యంకు మధ్య ఉండవలసిన సమన్వయం గురించి వివరించారు. సమావేశంలో ఎస్ఐ గోవిందు, ధర్మవరం లేబర్ ఆఫీసర్ నరేష్‌కుమార్, న్యాయవాది బాలసుందరి, పారాలీగల్ వలంటరీ షామీర్ బాషా, కోర్టు సిబ్బంది, ఫ్యాక్టరీ యజమాని జింకా రామాంజినేయులు, కార్మికులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ



మోడల్‌స్కూల్ విద్యార్థినులు

పుట్టపర్తి అర్బన్: ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పుట్టపర్తి మండలం జగరాజుపల్లి మోడల్‌స్కూల్ విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. ఈ నెల 3, 4 తేదీల్లో ఒంగోలు జిల్లా మార్కాపురంలో 54వ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు నిర్వహించారు. మోడల్‌స్కూల్ విద్యార్థినులు ఓంశ్రీ, వినీత, లేఖన, ఫర్హానా, శాలిని ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానం సాధించినట్లు ప్రిన్సిపాల్ రమేష్‌బాబు, పీడీ అజీంబాషా పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో రాణించి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ఇదేమి స్వామిభక్తి?



పల్లె రఘునాథరెడ్డిని కలిసిన ఎస్ఈ

పుట్టపర్తి టౌన్: విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ (ఎస్ఈ)గా నియమితులైన సంపత్‌కుమార్ మంగళవారం అనంతపురంలో మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన్ను ఘనంగా సన్మానించి స్వామి భక్తి చాటుకున్నారు. భయమో భక్తో తెలియదు కానీ జిల్లా కేంద్రం పుట్టపర్తిలో బాధ్యతలు తీసుకొన్న ప్రతి అధికారీ స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డిని పక్కన పెట్టి ప్రొటోకాల్‌కు ఉల్లంఘించి మరీ మాజీ మంత్రి, టీడీపీ నేత పల్లె రఘునాథరెడ్డిని కలిసి ఆశీస్సులు తీసుకుంటుండటం విమర్శలకు తావిస్తోంది.

బాలికలు చదువులో రాణించాలి

తనకల్లు: బాలికలు చదువులో రాణించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవమ్మ అన్నారు. బాలసముద్రంలో సీడీపీఓ జయంతి ఆదేశాల మేరకు 'బేటీ బచావో– బేటీ పఢావో' కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు గ్రామంలో ఆరోగ్య సిబ్బంది, కిశోర బాలికలతో కలిసి ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో కార్యదర్శి ఆంజినేయులు, మహిళా కార్యదర్శి తరానా, కార్యకర్తలు రాణి, రమణమ్మ, సుగుణమ్మ, లక్ష్మీదేవి, సుకన్య పాల్గొన్నారు.

పార్వతీదేవిగా వాసవీమాత



కదిరి టౌన్: పట్టణంలోని కన్యకా పరమేశ్వరి వాసవీ మాత జయంతి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. మంగళవారం అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. వాసవీ మాతను వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. పార్వతీదేవి అలంకారంలో వాసవీమాత భక్తులకు దర్శనమిచ్చారు.

విగ్రహాల ప్రతిష్టాపన

ముదిగుబ్బ: దొరిగిల్లులో మహాగణపతి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, నంది, శ్రీశైల మల్లికార్జున స్వామి విగ్రహ ప్రతిష్ట, అలాగే వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు హాజరై స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

చెత్తకు నిప్పు.. కాలుష్యం ముప్పు



రోడ్డు పక్కన చెత్త వేసి కాల్చుతున్న దృశ్యం

ఆరోగ్యాన్ని పంచాల్సిన క్లాప్ మిత్రలు గ్రామాల్లో చెత్తను సేకరించి రోడ్ల పక్కన పడేసి అనారోగ్యాన్ని పంచుతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో డంపింగ్ యార్డుల్లో చెత్తను వేసి వర్మీ కంపోస్టు ఎరువు తయారు చేసి పంచాయతీలకు ఆదాయాన్ని చేకూర్చేందుకు చర్యలు తీసుకుంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పాత సిబ్బందిని తొలగించి వారి అనుయాయులను చేర్చుకుంది. అప్పటి నుంచి డంపింగ్ యార్డులను నిర్వీర్యం చేసి చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేసి తగులబెడుతున్నారు. పుట్టపర్తి మండలం పెడపల్లి వద్ద పుట్టపర్తి–గోరంట్ల ప్రధాన రహదారి పక్కనే వేసి కాలడంతో భరించలేని పొగ వస్తోందని ప్రజలు చెబుతున్నారు. చికెన్ సెంటర్ల నుంచి వచ్చే వ్యర్థాలు, భవన నిర్మాణ శిథిలాలు సైతం రోడ్డు పక్కనే పడవేస్తున్నారు. దీనిపై ఈఓఆర్డీ ఇందిరబాలను సంప్రదించగా.. వెంటనే గ్రామాన్ని సందర్శించి చర్యలు తీసుకుంటామన్నారు.

– పుట్టపర్తి అర్బన్:

పేకాట స్థావరంపై దాడి

కదిరి అర్బన్: ఎరుకులవాండ్లపల్లి సమీపంలో మంగళవారం పేకాట స్థావరంపై రూరల్ అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ సీఐ నిరంజన్‌రెడ్డి దాడులు నిర్వహించారు. ఏడుగురిని అరెస్ట్ చేసి, రూ.2,050 నగదు స్వాధీనం చేసుకున్నారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

పుట్టపర్తి టౌన్: పౌర్ణమిని పురస్కరించుకొని భక్తుల సౌకర్యార్థం అరుణాచలం గిరి ప్రదక్షిణకు ఈ నెల 11న పుట్టపర్తి ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఉదయం 6.30 గంటలకు ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ ఇనయతుల్లా తెలిపారు. అరుణాచలం గిరి ప్రదక్షణతో పాటు వేలూరు గోల్డెన్ టెంపుల్, కాణిపాక వరసిద్ది వినాయక స్వామి దర్శనం అదనంగా చూపించడానికి ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఆన్‌లైన్ ద్వారా, పుట్టపర్తి బస్టాండ్ నుంచి టికెట్లు రిజర్వేషన్ చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 73828 59729, 99592 25857, 94402 01570 నంబర్లలో సంప్రదించాలన్నారు.

నేడు వాహనాల వేలం

కదిరి అర్బన్: స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను బుధవారం వేలం వేయనున్నట్లు ఎస్ఐ శ్రీధర్

సంక్షిప్త సమాచారం

తెలిపారు. వేలం పాటలో పాల్గొనదలచిన వారు ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, రూ.5 వేల టోకెన్ అమౌంట్ చెల్లించాలన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోండి



ఫిర్యాదు చేస్తున్న వేముల అమర్నాథ్‌రెడ్డి

ప్రశాంతి నిలయం: ముద్దిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థి అశ్విన్ ఆరాధ్య విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన ఘటనపై పూర్తి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అమర్నాథ్‌రెడ్డి మంగళవారం కలెక్టరేట్‌లో డీఆర్‌ఓ విజయ సారథికి ఫిర్యాదు చేశారు.

వైభవంగా గంగమ్మ విగ్రహ ప్రతిష్ట

పుట్టపర్తి అర్బన్: వెంకటగారిపల్లిలో గంగమ్మ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. పాత ఆలయాన్ని జీర్ణోద్ధరణ గావించి గ్రామస్తులు రూ.20 లక్షల దాకా చందాలు పోగు చేసి ఆలయాన్ని పునఃనిర్మింపజేశారు. మంగళవారం ఆలయంలో విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు చేశారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు.

గ్రంథాలయ అభివృద్ధికి సహకరించండి

కనగానపల్లి: దాతలు విరాళాలు, పుస్తకాలు అందించి గ్రంథాలయ అభివృద్ధికి సహకరించాలని మండల గ్రంథాలయాధికారి గోవిందు కోరారు. స్థానిక గ్రంథాలయానికి మంగళవారం దాత అక్కులప్ప జాతీయ నాయకులు అల్లూరి సీతారామరాజు, జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటాలను అందజేశారు. వేసవి శిక్షణ శిబిరంలోని విద్యార్థులకు యువకులు రాజేష్, నరేష్‌లు తమవంతు సహకారాన్ని అందించేందుకు ముందుకు వచ్చారు. యోగా గురువు సుబ్బరాయుడు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

ముదిగుబ్బ: పరిశుభ్రతతోనే చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారని సీడీపీఓ సరస్వతి తెలిపారు. మంగళవారం రాళ్లఅనంతపురంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కౌమార బాలికల వికాసం సమ్మర్ క్యాంపు నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా శిశు సంరక్షణ కార్యదర్శి లక్ష్మీ, అంగన్‌వాడీ కార్యకర్త రజియా తదితరులు పాల్గొన్నారు.